అపరిచితులే కాకుండా బంధువులూ, స్నేహితులూ, పరిచయస్తులూ...
అందరూ, ప్రతి ఒక్కరూ అవినీతో, అన్యాయమో, అక్రమమో, అనైతికమో,
మోసమో చేస్తున్నారు, చేయబడుతున్నారు. నేనేం మినహాయింపు కాదు.
తప్పు చేసినప్పుడు ఎవరికీ సంజాయిషీ ఇవ్వకపోయినా. కనీసం
మన లోపలి మనని ప్రతి క్షణం కనిపెట్టుకుని ఉన్నవాడికైనా
ఎప్పుడో ఒకప్పుడు జవాబివ్వాల్సిందే. నాలోని నాకు, నేనిచ్చుకున్న జవాబే ఈ కథ.

5

కొట్టం రామకృష్ణారెడ్డి

# చెల్లని మొహం

చారి పి.ఎస్.





టవలు కట్టుకుని, విప్పేసిన లుంగీ బనియనును వాషింగ్ మెషీన్‌లో వేస్తున్నప్పుడు వినిపించింది, మా ఆవిడ వాకిట్లో గేటు బయట ఎవరితోనో మాట్లాడుతున్న విషయం.

“ఏ రోజన్నా మా ఇంటిముందు రోడ్డూడ్చారా? రోజూ మా పనిమనిషే కదా ఇంటి ముందు రోడ్డుని ఈ చివరి నుండి ఆ చివరిదాకా ఊడుస్తున్నది, మొన్నటికి మొన్న ఆ మూలనున్న మట్టికుప్పని ఎత్తేయమని చెబితే కనీసం అటువైపు చూడనన్నా చూడలేదు... మళ్లీ ఇప్పుడు పండగ మామూలని ఎలా అడగాలని పిస్తూంది మీకు?”

విషయం అర్థమైంది. మున్సిపాలిటీవాళ్లు.

మా ఆవిడ మాటల్లో వీసమంతైనా అబద్ధం లేదు. రోజూ దగ్గరుండి ఇంటి ముందు ఊడిపిస్తుంది. కొద్దిగా కూడా చెత్త కనిపించనివ్వకుండా. అందుకు ఒప్పుకోవాలి తన శుభ్రతకీ, ఓపికకీ.

ఆఫీసుకి టైమవుతూంది, తాత్సారం చెయ్యలేను... బాత్రూం లోకి దూరాను.

అవినీతికీ, అన్యాయానికీ పూర్తిగా వ్యతిరేకం తను. అస్సలు సహించదు. కూరలమ్మే వారి దగ్గరైనా, దేశాన్నేలేవారైనా సరే... కుండ బద్దలు కొట్టేస్తుంది. నాకూ, నా వ్యక్తిత్వానికీ జిరాక్స్ కాపీ, నా ప్రవర్తనకి కార్బన్ కాపీ. చుట్టుపక్కలేకాదు, చుట్టాల్లో కూడా శత్రువులే ఎక్కువ ఇద్దరికీ. యదార్థవాది లోకవిరోధి చందం.

భళ్లున ఏదో పగిలిన శబ్దం వినిపించింది.

“ఏమైందీ?” అరిచాను లోపల్నించి ఆందోళనగా.

కాసేపు నిశ్శబ్దం.

ఈసారి కొంచం గొంతు పెంచాను.

అర నిమిషం తరువాత చెప్పింది.

“డ్రస్సింగ్ టేబుల్ అద్దం పగిలింది.”

“ఎలా?”

జవాబు లేదు.

స్నానం పూర్తిచేసుకుని బయటికి వచ్చాను.

అప్పటికే పగిలిన అద్దం ముక్కలు తీసేసి శుభ్రం చేసేసింది.

అప్రయత్నంగా కనిపించింది డ్రెస్సింగ్ టేబుల్ మీద తెల్లగా మెరుస్తూ ఉన్న చైన్, ప్లాటినం అనుకుంటా. దానికి తగిలించి ఉన్న డైమండ్ పెండెంట్. తను ఎప్పుడు కొన్నదీ నాకు గుర్తులేదు. బంగారంమీదా, నగలమీదా నాకు దృష్టి తక్కువ. పట్టించుకోలేదు.

"ఐరన్ బాక్స్ తగిలింది," నన్ను చూసి తడబడింది. నేను రెట్టించలేదు.

డ్రస్ చేసుకుని తల దువ్వుకుందామని వాష్ బేసిన్ దగ్గరకెళ్లాక గుర్తొచ్చింది, నిన్ననే ఈ అద్దం కూడా పగిలిన సంగతి.

నిన్న ఆఫీసు నుంచి వచ్చేసరికే పగిలిపోయి ఉన్నది.

జారి పడిందని చెప్పింది.

నాకు తమాషాగా అనిపించింది... ఇంట్లో అద్దాలు వెంటవెంటనే పగిలి పోవడం.

పోర్టికోలోంచి కారు బయటికి తీసి, రోడ్డుకు వారగా ఆపి రియర్ వ్యూ మిర్రర్‌లో మొహం చూసుకుని వేళ్లతో జుట్టు సవరించుకున్నాను. నా జుట్టుని మిలట్రీవాడిలా డ్రస్సింగ్ చేయించుకోవడం అలవాటు.

ఈలోగా ఇంటికి లాక్ చేసి వచ్చి పక్కసీటులో కూచుంది తను. తెల్లని కుర్తా పైజామాలో మల్లెపువ్వులా కనిపించింది. మెళ్లోని కావి రంగు చున్నీతో కలిపి చూస్తే పారిజాతం పువ్వులా ముద్దొచ్చింది.

చున్నీతో తలని పూర్తిగా కప్పేసి, మళ్లీ అడ్డంగా మొహానికి మాస్క్‌లా చుట్టేసింది. కళ్లకి నల్లటి గాగుల్స్.

"కార్లో వెళ్తూ కూడా ఇన్ని చర్మసౌందర్య రక్షణ కవచాలు దేనికి? టూ వీలర్‌లో వెళ్లట్లేదుగా," తనని ఉడికించాలని అడిగాను.

"పర్లేదు... తొందరగా ఆఫీసు దగ్గర దింపేయండి, నా క్లయింట్ వెయిట్ చేస్తుంటాడు. వారం క్రితం శాంక్షన్ అయిన లోన్ తాలూకు చెక్కు ఇవ్వాలి," కళ్లు చికిలించడం వలన తను నవ్విన సంగతి తెలిసింది.

ఓ జాతీయ బ్యాంకులో కమర్షియల్ మేనేజర్‌గా పనిచేస్తున్నది. చాలా నిక్కచ్చి, నిబద్ధత, నిజాయితీగల ఆఫీసర్‌గా పేరు సంపాదించుకున్నది. కష్టపడి పనిచేసే తత్వం తనను అంచెలంచెలుగా అతి తక్కువ కాలంలో పైకెదిగేలా చేసింది. తనంటే నాకు గౌరవం... కొన్నిసార్లు ఆదర్శం కూడా.

కాలనీలోంచి మెయిన్ రోడ్డు మీదికి కారు మలుపు తిరుగుతుండగా గమనించాను, నేను రెగ్యులర్‌గా వెళ్లే హెయిర్ డ్రెస్సింగ్ షాపుముందు గుంపుగా

గుమికూడిన జనాలను. పక్కగా కారాపి తెలిసిన కాలనీ వాసిని అడిగాను కారు దిగకుండానే, "ఏమైంది?" అని.

"పొద్దున్నే ఏడుగంటలకి ముసుగేసుకున్న నలుగురు కాలేజీ కుర్రాళ్లు దాడి చేసి షాపులోని అద్దాలన్నింటినీ పగలగొట్టి పారిపోయారు," వివరించాడు.

ఎందుకని అడిగితే తెలీదన్నాడు. అయోమయంగా తోచింది.

"థాంక్స్," అని జవాబిచ్చి కారుని ముందుకు కదిపాను.

క్రిక్కిరిసిన ట్రాఫిక్‌లో మెల్లిగా కదులుతున్నది కారు. బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లు, నడిచివెళ్లేవాళ్లు అందరూ తొందరతొందరగా, హడావిడిగా అసహనంగా కదులుతున్నారు. నింపాదిగా వెళ్తుంది కారు... ఏమాత్రం ఖంగారు లేకుండా. అరగంట ముందుగానే నేను చేరవలసిన గమ్యాన్ని అందుకునే అలవాటు నాకు. అందుకు కాస్త తొందరగానే ఇంట్లోంచి బయల్దేరే అలవాటు... అలవాటై పోయింది.

చుట్టుపక్కల పరిసరాలనూ, మనుషులనూ పరిశీలించడం నాకు తెలీకుండా జరిగిపోయే ప్రక్రియ. అది ట్రాఫిక్‌లో అయినా, ఏదైనా ఫంక్షన్‌లో అయినా అంతే. మనుషులు వారి హావభావాలు, వాళ్ల నడవడి, ప్రవర్తన మొదలైనవి నాకు తెలీకుండా నాలోకి ఇంకిపోయే విషయాలని నాకు అప్పుడప్పుడూ తోస్తుంది. ఆ గమనింపే నా ప్రొఫెషన్‌కి నాంది కాబోలు.

ఎందుకో ఈరోజు చుట్టూ ఉన్న మనుషులు కాస్త అసహజంగా ఉన్నట్టని పించారు. బండ్లు తోలేవాళ్లు, ఫుట్‌పాత్ పై నడిచి వెళ్లేవాళ్లు అందరూ రోజూలా కాకుండా... ఏదో పోగొట్టుకున్న వాళ్లలా... బెదురుగా... ఏదో తేడాగా అనిపించారు.

"ఏదో లోకంలోకి కూరుకుపోతున్నట్టున్నారు?"

వెంటనే లోతుల్లోంచి బయటపడి తనని చూసి నవ్వేసాను.

"మనుషులంటే ఎందుకంత ఇష్టం మీకు?" అడిగింది.

"దే ఆర్ మై రా మెటీరియల్స్... నా ముడిసరుకులు వాళ్లు," తేల్చేసాను.

"టూ మచ్," వెక్కిరించింది.

"నిజం! ఫినిష్డ్ ప్రొడక్ట్ బయటికి రావడానికి ఇన్వెస్టర్స్," సమర్థించుకున్నాను.

"నేనూ అమ్మాయి కూడానా?"

"అఫ్ కోర్స్ కొన్నిసార్లు... అవసరమైనప్పుడు."

"వ్యాపార ధోరణి."

"కావచ్చు."

బ్యాంకు ముందు కారు ఆగుతుండగానే సూటూ బూటూ వేసుకున్నతను హడావిడిగా వచ్చి కార్ డోర్ తియ్యడానికి రెడీ అయిపోయాడు.

“తను నా క్లయింట్,” కారు దిగుతూ చెప్పి డోర్ వేసింది. రెండడుగులు ముందుకు వేసి మళ్లీ వెనక్కి వచ్చి చెప్పింది, “రేపు మార్నింగ్ అమ్మాయి బెంగళూరు నుండి వస్తుంది, ఇవ్వాళ కొద్దిగా షాపింగ్ కెళ్లాలి గ్రాసరీస్ కోసం... మళ్లీ వారందాక కుదరదు, కొంచం తొందరగా రాగలరా?”

“విల్ ట్రై,” అని ముందుకు సాగాను.

నా ప్రమేయం లేకుండానే కారు అలవాటుగా తోలుతున్నాను. మళ్లీ మెదడు లోకి చొచ్చుకొస్తున్న మనుషుల ఆనవాళ్లు. ఇంకాస్త పరికించి, చుట్టూ ఉన్నవారిని పనిగట్టుకుని పరిశీలించసాగాను.

ప్రొఫెషనల్ రైటర్‌ని. తెలుగు సాహితీ ప్రపంచంలో కాస్త పేరు పొందిన వాడినే. కమర్షియల్ రైటర్‌గా నిలదొక్కుకున్నాక పంథా మార్చుకుని మానసిక వికాస రచనలు మొదలెట్టాను. రాసినవన్నీ బ్లాక్‌బస్టర్స్. డబ్బూ ఆ వెనకాలే కీర్తీ నడిచొచ్చాయి. నిజాయితీగా రాస్తూ, విలువలకి కట్టుబడి ఉంటాననే ఖ్యాతిని వెనకేసుకున్నాను.

ఔటర్ రింగ్ రోడ్డుకి దగ్గరలో ఒక స్టూడియో అపార్ట్‌మెంట్ కొని ఆఫీసుగా ఏర్పాటుచేసుకొని, నా రచనావ్యాసంగం అక్కడి నుంచే కొనసాగిస్తున్నాను. మార్నింగ్ టెన్ టు సిక్స్ ఆఫీస్ అవర్స్. చాలామందికి నా ఈ ధోరణి నచ్చదు. ఒక ఉద్యోగం లాగా, వ్యాపారంలాగా కళ రాణించదు అని వారి అభిప్రాయం. అందుకు నేను పూర్తి విరుద్ధం. కమర్షియల్ రైటర్ అంటే ఇరానీ కేఫ్‌లో కూచుని రామాయణంలోని ఒకానొక ఘట్టాన్ని అచ్చ తెలుగులో కథగా రాసి సమకాలీన పాఠకుల్ని మెప్పించడమే ప్రొఫెషనల్ రైటర్ లక్షణమనేది నా ఫిలాసఫీ. అలా రాసి మెప్పించాను కూడా.

వృత్తిలో భాగంగానే ఈ పరిశీలన. మామూలు మనుషుల భావోద్వేగాలను ఒడిసి పట్టుకుని రచనలు చేయడమే నాకు ఇష్టం.

పొద్దుటినుంచీ నేనకుంటున్నదే నిజం అనిపిస్తోంది. ఇవాళ రోడ్డు మీద మనుషులందరూ వింతగా తోస్తున్నారు. వారి ప్రవర్తన నార్మల్‌గా లేదు.

అకస్మాత్తుగా నా కారు పక్కనుంచి మొహానికి కర్చీఫ్ కట్టుకున్న ఒక బైకతను వేగంగా కదిలి, డ్రైవర్ సీట్ విండో పక్కగా ఉన్న రియర్ వ్యూ మిర్రర్ని పగలగొడుతూ వెళ్లిపోయాడు. బైకు నంబర్ చూడ్డానికి ప్రయత్నించాను. నంబర్ ప్లేట్ తీసేసుంది కానీ మడ్గార్డ్ మీద స్పష్టంగా కనిపిస్తున్న ‘పోలీస్’ అనే అక్షరాలను చూసి విస్తు పోయాను.

నడిరోడ్డు మీద కారాపి దిగి చూసేసరికి అతను అక్కడ్నించి మాయమై పొయాడు. చిర్రెత్తుకొచ్చింది. ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా నిట్టూర్చి మళ్లీ కారుని

కదిలించాను. అసహనం నన్ను ఆక్రమించుకోకుండా నియంత్రించుకోవడానికి కష్ట పడాల్సి వచ్చింది.

ఔట్‌స్కర్ట్స్‌కి చేరుకుంటుండగా నా కారుని ఓవర్ టేక్ చేసిన బ్లాక్ స్కోడాని, అంతే వేగంగా క్రాస్ చేసిన ఒక ఎస్యూవీ, ఆ స్కోడాకి అడ్డంగా వెళ్లి ఆపేసారు. వెనకాలే నేను కారుని స్లో చేసాను.

ఎస్యూవీలోంచి మంకీ క్యాప్స్ పెట్టుకుని, హాకీ స్టిక్స్ పట్టుకు దిగిన నలుగురు కుర్రాళ్లు ఆ స్కోడా మీద విరుచుకుపడి, దానికున్న నల్లటి అద్దాలను అన్నింటినీ ధ్వంసం  చేసి, వచ్చినంతసేపట్లో మాయమైపోయారు. దూరంగా వెళ్లిపోతున్న ఆ కారు వెనక అద్దం మీద 'ఎమ్మెల్యే' అనే స్టిక్కరు స్పష్టంగా కనిపించింది.

నేను చేష్టలుడిగి నిల్చుండిపోయాను. స్కోడా పక్కగా కారాపి వారి దగ్గరి కెళ్లాను. అదృష్టవశాత్తు అందులో ఉన్న నడివయసు దంపతులకు ఏమీకాలేదు. ఆ కుర్రాళ్లు ఎవరో తెలీదుకానీ,  కారు అద్దాలకున్న నల్లటి ఫిల్మ్ తీసేయమన్నారని చెప్పాడు. ఈసారి నాకు నిజంగానే విచిత్రంగా తోచింది. కొత్తగా ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తున్నారు మనుషులు ఈ రోజు.

ఫ్లాట్ హాట్స్ పెట్టుకుని, కళ్లకి కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని మొహమంతా కవర్ చేసుకున్నట్లున్న ఆ నడివయసతన్ని అడిగాను, "మీరేం చేస్తుంటారు?" అని. అతనింకా ఆ దాడి తాలూకు భయంలోంచి బయటపడలేదు. తడబడుతూ చెప్పాడు 'లాయర్' ని అని. అతనికి నా కార్డు ఇచ్చి అవసరమైతే సాక్ష్యానికి వస్తానని భరోసా ఇచ్చి, పోలీస్‌కి కంప్లైంట్ చెయ్యమని చెప్పి పంపించి ఆఫీసుకు చేరు కున్నాను.

అప్పటికే శాంతమ్మ ఆఫీసంతా కసువూడ్చి, తుడిచి, టేబుల్ అవీ అన్నీ క్లీన్ చేసి వెళ్లిపోయింది. ఆఫీసు తాళంచెవి ఒకటి తన దగ్గరుంటుంది.

ఎలెక్ట్రిక్ కెటిల్ ఆన్ చేసి నీళ్లు వేడి చేసుకుని, గ్రీన్ టీ చేసుకుని దాన్ని అస్వాదిస్తూ కుర్చీలో చేరగిలబడి కూచోని అంతకుముందు రోజు ఎక్కడివరకు రాసానో, దొంతరలుగా పేర్చిన కాగితాలను చేతిలోకి తీసుకుని నెమ్మదిగా ఒక ధ్యానంలోకి, తపస్సులోకి, ఆలోచనలలోకి కూరుకుపోసాగాను.

అకస్మాత్తుగా తేరుకుని రాయడానికి ఉపక్రమించాను. రాస్తూ... రాస్తూ... మధ్యలో ఆగిపోయాను, తిరిగి అస్తవ్యస్తంగా ఉన్న ఆలోచనలను క్రమబద్ధీకరించి మళ్లీ రాయడం మొదలెట్టాను.

ఇంతలో ఫోన్ మోగింది. మా అమ్మాయి బెంగళూరు నుంచి.

"నాన్నా."

“చెప్పు బేటా, ఏంటి సంగతులు?”

“మరి రేపు నేను రావట్లేదు,” నసిగింది.

“అదేంటి అమ్మ నువ్వు వస్తున్నావంది?”

“లేదు నాన్నా! నాకు కొంచం పని ఉంది,” నీరసం వినిపించింది.

“అంతా ఓకే కదా?”

“అంతా ఓకేనే నాన్నా, అమ్మకి చెప్పు నేను నెక్స్‌ట్ మంత్ వస్తానని.”

“అదేదో నువ్వే చెప్పొచ్చు కదా?”

“ఈ సారికి నువ్వు చెప్పెయ్యి నాన్నా!... అవునూ న్యూస్ చూస్తున్నావా?”

“లేదే, ఏమైనా విశేషమా?”

“లేదు ఊరికే అడిగా... సరే అమ్మకి చెప్పు నేను రావట్లేదని... ఉంటాను, బై,” ఫోన్ పెట్టేసింది.

బెంగళూరులో ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నది గత అయిదేళ్ల నుంచి. తను చెప్పింది మెదడులోకి చేరలేదు. అప్పటికే నేను రాస్తున్న పుస్తకం మీదే ఉంది ధ్యాసంతా. రాసుకోవడం మొదలెట్టాను.

ఒక్కోరోజు ఒకలా ఉంటుంది మనసు. దానిని గాడినపెట్టడమే మన పని.

టైం ఎంతయ్యిందీ తెలీలేదు.

మళ్లీ మోగింది ఫోన్. విజయనగరం నుంచి నా తోటి రచయిత, బషీరుద్దీన్. బాగా రాస్తాడు. సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ఎక్కువగా అప్పుడప్పుడే పైకెదుగుతున్న కుర్ర రచయితలను వెంటేసుకుని తన పేరు ప్రతిష్ఠలు పెంచుకునే ప్రయత్నం నిత్యం ఆచరణలో పెడుతుంటాడు. సాహిత్యలోకంలో బషీర్‌గా పేరు తెచ్చుకున్నాడు.

“ఎలా ఉన్నారు బాస్,” పలకరించాను.

“మిత్రమా, చాన్నాళ్లయ్యింది మనం మాట్లాడుకుని, అంతా కుశలమే కదా,” క్షేమ సమాచారాలు ఇచ్చి పుచ్చుకున్నాక విషయంలోకి దిగాడు.

“సాహితీసేద్యం వాళ్లు ప్రకటించిన కథల పోటీకి న్యాయనిర్ణేతగా మీరే ఉన్నారని తెలిసింది.”

“అవును,” జవాబిచ్చాను. ప్రతిష్ఠాత్మకంగా ప్రతి యేడూ కథల పోటీ ప్రకటించే సంస్థ ‘సాహితీసేద్యం.’ ఉత్తమ కథకి లక్ష రూపాయల పారితోషికం ఇస్తారు. ఈసారి తుది న్యాయనిర్ణేతగా నన్ను ఎంపిక చేసారు.

“పోటీకి వచ్చిన కథలెలా ఉన్నాయి గురూ?” బషీర్.

“ఇప్పుడిప్పుడే చదవడం మొదలెట్టాను, తీరిక దొరికినప్పుడు చదువుతున్నా,” చెప్పాను.

“మంచి కథలేమైనా వచ్చాయా? ఫలితాలు ఎప్పుడు బయటికి రావొచ్చు?”

“పర్లేదు... బాగానే ఉన్నాయి కథలు, ఇంకా అన్నీ చదవలేదు.”

“నేనూ ఒక కథ పంపించాను, ‘పీరీలు’ అని, చదివారా?”

“అవునా... ఏ కథ ఎవరిదో నాకు చెప్పరని మీకు తెలుసు కదా?”

“అందుకే గురూ మీకు నా కథ పేరు చెపుతున్నది, చాలా బాగా వచ్చింది కథ, ఎలా వుందో చదివి చెప్పాలి.”

“తప్పకుండా!” నాకు ఏదో తెలుస్తున్నదనిపించింది.

“లక్ష రూపాయలు గురూ, మీరు ఉన్నారనే ధైర్యంతో ఫోన్ చేస్తున్నాను,” అతని మాటల్లోని మర్మం నేను తెలుసుకోవాలని చెపుతున్నట్లే ఉన్నది.

“చదువుతా బషీర్,” చెప్పాను.

“ఈసారికి నన్ను బయటపడేయండి గురూ, రుణం ఉంచుకోను.”

నాకేం మాట్లాడాలో అర్థంకాలేదు.

“డబ్బులదేం ఉంది గురూ! మొదటి బహుమతి రావాలిగానీ,” డీల్ ప్రొపోస్ చేస్తున్నాడు.

“అర్థం కాలేదు బషీర్!” కుండ బద్దలు కొట్టాలి.

“క్విడ్ ప్రోకో గురూ! డబ్బు మీది, బహుమతి నాది,” ధైర్యంగా నేను ఒప్పుకుంటాననే విశ్వాసంతో చెప్పాడు. అతని నమ్మకాన్ని వమ్ము చేయనని మాటిచ్చాను. ఈ ఫీల్డ్‌లో ఇవన్నీ మామూలే. అసలు ఏ ఫీల్డ్‌లో లేదు ఇది!

ఇప్పటివరకు తప్పటడుగు వెయ్యని నేను, నీతికీ, నిజాయితీకీ మారుపేరైన నేను బషీర్ మాటలకి పడిపోయానా? లేక నా లోలోపల, అంతరంగపు లోతుల్లో నాక్కూడా తెలీని నా నిజస్వరూపం బట్టలు విప్పేసిందా? బషీర్ ఫోన్ పెట్టేసాక కూడా అంతర్మథనం. ఎంతవరకు సమంజసం?

వైబ్రేషన్‌లోకి మార్చుకున్న ఫోన్ కదిలింది. ఈరోజు గ్యాప్ లేకుండా కాల్స్ వస్తున్నాయి. చూస్తే నా చిన్ననాటి స్నేహితుడు ఇమ్మాన్యుయేల్. ఆన్సర్ చేసాను.

“చెప్పరా మనిషీ...” వాడి పేరులోని ‘మాన్’ ని తెలుగీకరించి పలకరించాను.

“ఎక్కడున్నావ్?” నీరసంగా ధ్వనించింది వాడి గొంతు.

“ఆఫీసులో!”

“నేను ఈ పక్కనే ఉన్నాను... ఒకసారి కలవాలి.”

“వచ్చేయ్... నో ప్రాబ్లెం,” బాల్యమిత్రుడిని కలుసుకుంటున్నాననే ఉత్సాహంతో అన్నాను.

వారంలో నాలుగుసార్లు కలిసినా, మరొకసారి చిన్ననాటి స్నేహితుడిని కలుసుకోవడం ఎప్పటికీ ఉత్సాహమే.

“ఫైవ్ మినిట్స్‌లో ఉంటాను,” అని కట్ చేసాడు.

కెటిల్‌లో నీళ్లు నింపి, పూర్తిగా మరగబెట్టాక వచ్చాడు ఇమ్మాన్యుయేల్.

తలమీదుగా మఫ్లర్ చుట్టేసి, కళ్లకి నల్లటి అద్దాలు తగిలించుకుని మొహం పూర్తిగా కనిపించకుండా కొత్తగా కనిపించాడు.

రెండు కప్పుల్లో బ్లాక్ టీ కలిపి, ఒకటి వాడికందిస్తూ అడిగాను, “అంతా ఓకే గదా?... ఏంటీ అవతారం... ఎక్కడైనా దొంగతనంగానీ చేసావా, మొహం దాచిపెట్టుకుని తిరుగుతున్నావ్?” వెక్కిరింపుగా అడిగాను.

ఉలిక్కిపడ్డాడు. నెమ్మదిగా మఫ్లర్, కళ్లద్దాలు తీసేసి, నేనందించిన కప్ అందుకుని నేలచూపులు చూడసాగాడు. కొంచం అబ్‌నార్మల్‌గా కనిపించాడు. గడ్డం పెరిగిపొయ్యి ఉంది, కళ్లు ఎరుపెక్కి ఉన్నాయి. పెదాల్లో చిన్న వణుకు... ముక్కుపుటాలు అదురుతున్నాయి.

“ఏమయ్యింది?” వాడి చేతిమీద చెయ్యి వేసి నొక్కి అడిగాను.

జవాబివ్వకుండా... నా మొహంలోకి మొహంపెట్టి పరిశీలనగా చూస్తూ ఏదో వెతుక్కుంటున్నాడు. నిశ్శబ్దంగా వాడినే గమనిస్తున్నాను.

ఖాళీ కప్పు పక్కన పెట్టి, టేబుల్ చుట్టూ తిరిగి నా దగ్గరకొచ్చి నా మొహాన్ని రెండు చేతులతో తడమసాగాడు.

వాడి చేష్టలకి ఆశ్చర్యపోతూ, “గాలిగానీ సోకిందేంట్రా?” అన్నాను.

నా ప్రశ్నకి బదులివ్వకుండా నా రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని తన మొహానికి ఆనించుకున్నాడు. నా చేతులతో తన మొహాన్ని నిమరసాగాడు.

“ఏమయ్యిందిరా ఇలా ప్రవర్తిస్తున్నావ్?” కొంచం భయంగా అనిపించింది నాకు.

మెల్లిగా వెళ్లి తన కుర్చీలో కూర్చొని కళ్లు మూసుకుని అడిగాడు, “నా మొహం ఎలా ఉంది?”

“నీ మొహానికేమిరా మనిషీ, మా నల్ల బంగారానివి. కాకపోతే ఆ తెల్ల గడ్డం, ఎర్రని కళ్లు... రాత్రి ఫుల్లయ్యిందా?”

“కాదు.”

“మరి?”

“నా మొహం నాకు కనిపించటం లేదు!” కళ్లని నేలలోకి పాతేసి చెప్పాడు.

నాకేం అర్థంకాలేదు వాడు చెప్పింది. నాకర్థం కాలేదన్న సంగతి వాడికర్థ మయ్యింది.

“నా మొహం నాకు కనిపించక ఇవ్వాళ్టికి నాలుగు రోజులయ్యింది.”

“కనిపించకపోవడమేంటి?”

“నా మొహం నీకు కనిపిస్తుంది కదా! అది నాకు కనిపించడంలేదు,” వాడి గొంతులో అసహనం.

సడన్‌గా నా నోటిలోంచి రాబోయిన బూతుని బలవంతంగా దిగమింగుకుని, “ఒరేయ్! ఎవడి మొహం వాడికి కనిపించదన్న సంగతి... సీటు కిందికి యాభై వచ్చాక తెలిసిందా?” విసుగ్గా అన్నాను.

ఈసారి కూడా జవాబివ్వకుండా, నా మొహంలోకి దీర్ఘంగా చూసాడు కాసేపు. తల పంకించాడు. కొంచంసేపు శూన్యంలోకి చూసి టేబుల్ మీదుగా నాకు దగ్గరగా వంగి చెప్పాడు, “అద్దంలో నా మొహం నాకు కనిపించట్లేదు.”

“అదేంటి?” అదిరిపడి అడిగాను.

అవునన్నట్లు తలూపాడు.

వాడి మొహం తేరిపారా, పట్టి పట్టి చూస్తూ, “మరి నాకు కనిపిస్తోందిగా?” అడిగాను.

“ఎదుటివారికి కనిపిస్తుందిగానీ, అద్దంలో మన మొహం మనకు కనిపించదు.”

“అబ్సర్డ్,” అరిచాను.

“నిజం,” నొక్కి పలికాడు.

కాసేపు నిశ్శబ్దం ఆవరించింది ఇద్దరి మధ్యా.

“ఎప్పటి నుంచి కనిపించట్లేదు?” సడెన్‌గా అడిగాను.

“ఇవ్వాల్టికి నాలుగోరోజు.”

“ఎవరికైనా చెప్పావా ఈ విషయం?”

“దాదాపు అందరి పరిస్థితి ఇలాగే ఉంది.”

నాకంతా అయోమయంగా ఉంది. ఎలా రియాక్ట్ కావాలో అర్థం కాకున్నది.

“డాక్టర్ దగ్గరకు వెళ్తే?” అడిగాను.

“వెళ్లాను... వాళ్ల పరిస్థితీ అదే,” నిరుత్సాహంగా మొహం వేలాడేసాడు.

“ఎందుకిలా జరుగుతుందట?”

మళ్లీ నిశ్శబ్దం. రెండు చేతుల్లో మొహం దాచుకుని తనలో తాను కుంచించుకు పోయాడు. తప్పు చేసినవాడిలా తల దించుకున్నాడు.

“చెప్పరా ఎందుకిలా అవుతుంది?” రెట్టించాను.

“అవినీతికీ, అన్యాయానికీ పాలుపడ్డ వాళ్లకు జరుగుతుందిలా.”

బిత్తరపోయాను. మెదడంతా శూన్యం ఆవరించింది. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. తేరుకోడానికి చాలా సమయం పట్టింది. పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

"మరి ఇంతకు పూర్వం అలా అవినీతికీ, అన్యాయానికీ పాలుపడ్డవారికి ఎందుకు జరగలేదు? నీకేమైనా తెలుసా?"

తల అడ్డంగా ఊపాడు ఇమ్మాన్యుయేల్. ఆలోచిస్తున్నట్టుగా పైకప్పుకేసి చూస్తూ అన్నాడు, "నాలుగు రోజుల క్రితం ఖగోళ శాస్త్ర చరిత్రలో ఎన్నడూ జరగనిది జరిగి, అన్ని గ్రహాలూ ఒకే వరుసలో సరళరేఖలోకి వచ్చినప్పటినుంచి ఇలా జరుగుతున్నదని టీవీలు అరచి గోల చేస్తున్నాయి."

నాక్కూడా గుర్తొచ్చింది ఆ విషయం.

"అదే అని ఎలా నిర్ధారించుకున్నారు?"

"అది ఒక ఊహ మాత్రమే... ఈ విషయం శాస్త్రీయంగా ఇంకా నిరూపింపబడలేదు."

మాటిమాటికీ ఇద్దరి మధ్యా శూన్యం ఆవరిస్తూనే ఉంది.

"ఒరే... నువ్వో ప్రైమరీ గవర్నమెంట్ స్కూల్ టీచరువి... నువ్వు తప్పు చేయడమేంట్రా... ఆ అవకాశమే లేదు కదా?" లా పాయింటు బయటికి లాగాను.

మళ్లీ తలను వేలాడేసుకుని చెప్పాడు, "అవును నేను తప్పు చేయడమేంటని చాలా ఆలోచిస్తే తెలిసింది, వారానికి మూడు రోజులే వెళ్తున్నాను స్కూల్‌కి, షిఫ్టులు ఏర్పాటు చేసుకున్నాం అందరం కలిసి," వివరించాడు.

ఇంకేం మాట్లాడలేదు నేను. టీవీ ఆన్ చేసాను. లైవ్ న్యూస్ రన్ అవుతోంది అన్ని చానల్స్‌లో. అద్దాలన్నీ పగలగొట్టబడిన ఒక కమర్షియల్ కాంప్లెక్స్ ముందు నిల్చుని బ్రేకింగ్ న్యూస్‌తో గగ్గోలు పెడుతున్నారు మొహాలకు గుడ్డలు తగిలించుకున్న యాంకర్లందరూ.

రెండు నిమిషాలు చూసి కట్టేసాను. అన్యమనస్కంగా పచార్లు చెయ్యసాగాను.

అంతెరుగని ఆలోచనలు చుట్టుముడుతున్నాయి. ఏ విషయమ్మీదా దృష్టి కేంద్రీకరించలేకపోతున్నాను. ఇవ్వాళ తెల్లవారుజాము నుంచీ జరిగిన సంఘటనలను ఒక్కొక్కటిగా నెమరేసుకోసాగాను.

"అవునూ మరి అద్దాలన్నీ అలా ఎందుకు పగలగొడుతున్నారందరూ?"

"ఈగో. ఎవరి మొహం వారికి కనపడట్లేదంటే అదీ, ఆ కారణంగా అంటే ఎవరికైనా అహం అడ్డొస్తుంది... అందుకే..."

కొద్దిసేపుండి ఇమ్మాన్యుయేల్ వెళ్లిపోయాడు.

ఆఫీసుకు తాళమేసి బయటపడ్డాను.

కారు సిటీలోకి ప్రవేశించింది. కర్చీఫ్‌లు, కళ్లద్దాలు, టోపీలు అమ్మే షాపులవద్ద పెద్ద ఎత్తున జనం గుమికూడి ఉన్నారు. అద్దాల మేడలన్నీ తునాతునకలై ఉన్నాయి.

ఒక షాపు ముందు కారు స్పీడు తగ్గించాక వచ్చింది ఆలోచన.

ఎవరి నుండి మొహం దాచుకోవాలి? అందరికీ అందరి మొహాలు బాగానే కనిపిస్తున్నాయి కదా. మరి దానికి ఈ ముసుగులెందుకు. వాటి అవసరం ఎవరికీ ఉండదనిపించింది.

కారు రోడ్డు పక్క ఆపేసి ఆఫీసులో కసువూడిచే శాంతమ్మకి ఫోన్ చేసి తను ఎత్తగానే ఏ విధమైన అలజడి లేకుండా ప్రశాంతంగా చెప్పాను.

"బాత్ రూంలో, వాష్ బేసిన్ దగ్గరున్న అద్దం పగిలిపోయింది, ఆ ముక్కలన్నీ తుడిచెయ్యి."

*ఆంధ్రజ్యోతి ఆదివారం*

*27 జూన్ 2021*

*



24 ఆగస్టు, 1969న రంగారెడ్డి జిల్లాలో పుట్టిన **కొట్టం రామకృష్ణారెడ్డి** మొదటి కథ **తీర్పు** రచన మాసపత్రికలో ఫిబ్రవరి, 1994లో అచ్చయింది. 30 పైగా కథలు రాశారు. 2019లో నూనెసుక్క ఇంకిన్ని కథలు కథాసంపుటం ప్రచురించారు. చేస్తున్నది అస్థిరమైన ప్రైవేట్ ఉద్యోగం.

చిరునామా: ***17-1-382/పి /123, గవర్నమెంట్ ప్రెస్ కాలని,***
***చంపాపేట్, హైదరాబాద్ - 500 059.***
***ఫోన్ : 924 6565 824     rkrkottam@gmail.com***